సాక్షి
నిజామాబాద్
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



అనుమతులు లేని చదువు..
అనుమతులు లేకుండా జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకొస్తున్నాయి. నిబంధనలను ఉల్లంఘిస్తూ స్కూళ్లను నడుపుతున్నారు.
- 8లో ▸



బాధ్యతల స్వీకరణ..
స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అంకిత్, పంచాయతీ అధికారిగా చక్రవర్తి తరుణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /20.6

వాతావరణం
ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగ్గురు ఏసీపీల బదిలీ

ఖలీల్‌వాడి: కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్మూర్ ఏసీపీ జగదీశ్‌చందర్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసి, ఖమ్మంరూరల్ ఏసీపీగా ఉన్న బస్వారెడ్డిని ఆర్మూర్‌కు బదిలీ చేశారు. బస్వారెడ్డి గతంలో ఎస్సై, సీఐగా జిల్లాలో పనిచేశారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజును మిర్యాలగూడ డీఎస్పీగా నియమించారు. అలాగే బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్‌ను డీజీపీకి అటాచ్ చేసి, హైదరాబాద్‌లోని ఐటీ సెల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌ను బోధన్ ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

26 నుంచి ఎంఈడీ సెమిస్టర్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈ నెల 26వ తేదీనుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 4 వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకోసం విద్యార్థులు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity.ac.inను సందర్శించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన డీఆర్డీవో



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి (డీఆర్‌డీవో)గా డి సాయాగౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు. గతంలో డీఆర్డీవోగా పనిచేసిన చందర్‌నాయక్ కామారెడ్డి జెడ్పీ సీఈవో గా బదిలీపై వెళ్లగా, అక్కడ సీఈవోగా పనిచేస్తున్న సాయాగౌడ్ డీఆర్డీవోగా జిల్లాకు వచ్చారు.

సొసైటీలో రూ.80 లక్షల అవినీతి

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ సహకార సొసైటీలో రూ.80 లక్షల వరకు అవినీతి జరిగిందని జిల్లా కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి వ్యవహారాన్ని సభ్యులైన రైతులతోపాటు సొసైటీ అధికారులకు తెలిపేందుకు మహాజన సభ ఏర్పాటు చేయాలని సూచించారు. అవినీతి సొమ్ము రికవరీకి తీసుకోవాల్సిన చర్యలను సమావేశం తరువాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బీజేఎల్పీ ఉపనేతగా కేవీఆర్

సాక్షి, కామారెడ్డి: భారతీయ జనతా పార్టీ శాసన సభాపక్ష ఉపనేతగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిలను ఓడించి చరిత్ర సృష్టించిన కేవీఆర్‌ను శాసనసభాపక్ష నేతగా నియమిస్తారని అందరూ భావించారు. అయితే ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచినందున ఉపనేత పదవితో సరిపెట్టారని తెలుస్తోంది.

జన్నేపల్లిలోని ఎస్ఆర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



ఆర్మూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో..




అక్షర శ్రీకారం

వసంత పంచమి వేడుకలను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీమాతకు ఆలయాలు, విద్యా సంస్థల ప్రాంగణాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చిన్నారులకు అక్షర శ్రీకారం దిద్దించారు. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన వసంత పంచమి పూజల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యం నేర్చుకునే చిన్నారులకు నృత్య గురువుల సమక్షంలో గజ్జె పూజ చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఉల్లంఘనులపై కొరడా

- అనుమతులకు మించి కంకర తవ్వకాలపై చర్యలు షురూ
- ఆర్మూర్ శివారులోని క్వారీకి రూ.41 కోట్ల జరిమానా
- కామారెడ్డి జిల్లా ఇసాయిపేట క్వారీకి రూ.53 కోట్లు..



ఆర్మూర్ శివారులో రూ.41 కోట్ల జరిమానా విధించబడిన క్వారీ (ప్రస్తుతం మూసేశారు)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ప్రభుత్వం మారిన అనంతరం ఒక్కో విభాగంలో అక్రమార్కులపై యంత్రాంగం వరుసగా కొరడా ఝుళిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజే ఆర్మూర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి సంబంధించి ఆయా విభాగాల అధికారులు రంగంలోకి దిగి చర్యలకు పూనుకున్నారు. తాజాగా ఆర్మూర్ శివారులో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కనుసన్నల్లో తీసుకున్న అనుమతులకు మించి కంకర తవ్వకాలు చేసిన విషయాన్ని గనుల శాఖ ఉన్నతాధికారులు నిర్ధారించారు. 3.6 హెక్టార్లకు అనుమతులు తీసుకుని అందుకు 95 శాతం అదనంగా తవ్వకాలు చేసినట్లు అధికార యంత్రాంగం తేల్చింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డిని కాదని అధికారులు ఏమీ చేయలేకపోయారు. ప్రస్తుతం అధికారం మారడంతో తీసుకున్న అనుమతుల మేరకు కాకుండా అనేక రెట్లు తవ్వకాలు చేసిన ఉల్లంఘనలపై గనుల శాఖ అధికారులు జరిమానా విధించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను ప్రవీణ్‌రెడ్డి పేరిట ఉన్న క్వారీకి రూ.41 కోట్ల జరిమానా విధించారు. ఈ విషయమై నిజామాబాద్ మైనింగ్ ఏడీ సత్యనారాయణ స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం ఈ క్వారీని నడపడం లేదు. ఇదిలా ఉండగా డిసెంబర్‌లో ప్రభుత్వం మారిన తక్షణమే మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి చెందిన ఆర్మూర్‌లోని కమర్షియల్ కాంప్లెక్స్(జీవన్ రెడ్డి మాల్)కు నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీ స్థలంలో కట్టినందున రెంటల్ బకాయిలు రూ.7,23,71, 807, విద్యుత్ బిల్లుల బకాయి రూ.2, 57,20,002, మరోవైపు మాల్ కట్టేందుకు తీసుకున్న రుణానికి సంబంధించి వడ్డీతో సహా రూ.45,46,90,000 చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. లేనిపక్షంలో సీజ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఇక కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని ఇస్సాయిపేట వద్ద శ్రీనివాస స్టోన్ ఇండస్ట్రీస్ క్వారీకి గనుల శాఖ రూ.53 కోట్ల జరిమానా విధించింది. తీసుకున్న అనుమతులకు మించి చుట్టుపక్కల ప్రాంతాలను భారీగా ఆక్రమించి తవ్వకాలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. పాత బకాయిలు రూ.21 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. ఈ క్వారీకి సంబంధించిన నైనిత కన్‌స్ట్రక్షన్ స్టోన్ క్రషర్‌కు రూ.34 లక్షలు జరిమానా విధించారు. ఈ విషయాలను మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ ధ్రువీకరించారు. ప్రస్తుతం దీని తవ్వకాలు నిలిపేశారు. అయితే ఈ క్వారీలో పేలుళ్ల కారణంగా తమ ఇళ్లు నెర్రెలు బారి దెబ్బతిన్నాయని గ్రామస్తులు డిసెంబర్ 26న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి అధికారులకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వం మారిన తరువాత మాత్రమే అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించడం బట్టి గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల తీరు ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పలువురు చెబుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదాయాన్ని జనరేట్ చేసేదాంట్లో భాగంగా అధికార యంత్రాంగం వరుసగా ఒక్కో అక్రమంపై, ఉల్లంఘనలపై చర్యలకు దిగడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం దృష్టి పెడితే మరిన్ని అక్రమ వ్యవహారాలు, ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు పెరుగుతాయని పలువురు అంటున్నారు.

న్యాక్ సెంటర్ రద్దు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

మోర్తాడ్(బాల్కొండ): జాతీయ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) సెంటర్‌కు మంజూరైన నిధులను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ద్వారా వివిధ రంగాల్లో యువతకు శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వ హయాంలో మోర్తాడ్‌తోపాటు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట్‌లో న్యాక్ సెంటర్ల నిర్మాణానికి రోడ్లు, భవనాలశాఖ అప్పట్లో రూ.10 కోట్లు మంజూరు చేసింది. న్యాక్ సెంటర్లను స్వతంత్ర హోదాలోనే కొనసాగిస్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే బాల్కొండ నియోజకవర్గానికి సంబంధించి న్యాక్ సెంటర్‌ను మోర్తాడ్‌లో నిర్మించేందుకు నిధులు కేటాయించారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రాడ్ బెండింగ్, ఇంటీరియర్స్ తదితర రంగాల్లో యువతకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు దోహదపడుతాయని గత ప్రభుత్వం భావించింది. గల్ఫ్ దేశాల్లోని కన్‌స్ట్రక్షన్ రంగంలో ఉపాధి అవకాశాలు ఉండడంతో యువతకు న్యాక్‌సెంటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందిన వారికి మంచి వేతనాలూ లభిస్తాయి. ప్రతి ఏడాది కనీసం రెండువేల మందికి శిక్షణ కల్పించే అవకాశం ఉంది. 2023 ఏప్రిల్‌లో న్యాక్ సెంటర్‌కు నిధులు మంజూరు చేయగా అప్పట్లో మంత్రిగా కొనసాగిన ప్రశాంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.5కోట్లతో భవన నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించారు. టెండర్ చివరి దశలో ఉండగా న్యాక్ సెంటర్లను రద్దు చేస్తున్నట్లు ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. న్యాక్ సెంటర్లకు నిధులు మంజూరు చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్తర్వులు జారీ చేసిన అధికారే నిధులను రద్దు చేస్తూ ప్రస్తుతం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. న్యాక్ సెంటర్‌కు నిధుల రద్దుపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. యువత ప్రయోజనాల కోసం మంజూరైన న్యాక్ సెంటర్‌ను ఎందుకు రద్దు చేశారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరో చోట న్యాక్ సెంటర్‌ను మంజూరు చేస్తారా లేక కొత్తగా నిధులను పెంచి మరోసారి మంజూరు ఇస్తారా అనే అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.



మోర్తాడ్‌లో న్యాక్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి(ఫైల్)

నిబంధనలను పాటించాలి

సుభాష్‌నగర్: ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులోభాగంగా జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం మరోమారు సందర్శించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పనితీరు పరిశీలన కోసం ఈసీఐఎల్ ఇంజినీర్లు నిర్వహిస్తు న్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆయనవెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు

ఎండోమెంట్ చెంతకు కబ్జా వ్యవహారం

- పూర్తి వివరాలు పంపిన ఏసీ సుప్రియ

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని బడా రాంమఠ్ భూముల కబ్జా వ్యవహారం దేవాదాయ, ధర్మాదాయశాఖ చెంతకు చేరింది. మఠానికి చెందిన వేలాది ఎకరాల భూమి ప్రస్తుతం 500 ఎకరాలకు పరిమితమైంది. కబ్జాల వెనుక నాయకులు ఉన్నట్లు అధికారులు గుర్తించి.. బాధ్యులపై చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. భూముల కబ్జా వ్యవహారంపై ఎప్పటికప్పుడు పూర్తి నివేదికలు పంపించాలని సహాయకమిషనర్ సుప్రియను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు ఎప్పటికప్పుడు నివేదికలను పంపిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

మఠం ఉత్తరాధికారి దినకర్ స్వామిజీ 93 ఏళ్ల వయస్సులో గతేడాది నవంబర్ 23న మృతిచెందారు. దినకర్‌స్వామిజీ ఆరోగ్యం సహకరించకపోవడంతో మేనేజర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సురేశ్ మఠం వ్యవహారాలను చూస్తూవచ్చారు. నాటి నుంచే వీరిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతోపాటు భూములను అక్రమంగా విక్రయించి దినకర్ స్వామిజీతో సంతకాలు పెట్టించినట్లు సమాచారం. వర్ని రోడ్డులోని ఒక ఎకరం 20 గుంటల భూమిని విక్రయించేందుకు మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ కలిసి కృష్ణారెడ్డి అనే వ్యక్తి నుంచి అడ్వాన్స్‌గా రూ. ఒక కోటీ 80లక్షలు తీసుకున్నట్లు సమాచారం. భూమి తన పేరున రిజిస్ట్రేషన్ కాకపోవడం, తాను ఇచ్చిన అడ్వాన్స్ డబ్బులు తిరిగి ఇవ్వకపోడంతో కృష్ణారెడ్డి ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు మేసేజ్ చేశాడు. దీనిపై కలెక్టర్ గత మంగళవారం సహాయ కమిషనర్ నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణారెడ్డి అడ్వాన్స్ ఇచ్చినట్లు ఆధారాలు చూపడంలేదని, పోలీసులు విచారిస్తే తప్ప అసలు విషయం తెలియదని స్పష్టం చేశారు. కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకునేందుకు సర్వేచేయిస్తానని ఏసీ తెలిపారు.

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

- సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వం
- ఎడపల్లిలో అందుబాటులోకి వచ్చిన సేవలు
- రైతులు, అధికారులు నేరుగా మాట్లాడుకునే అవకాశం



ఎడపల్లిలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతు సమావేశాల కోసం నిర్మించిన రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులోకి రానుంది. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు, పంటలసాగులో పాటించాల్సిన పద్ధతులు తదితర అంశాలపై రైతులు సమావేశమై చర్చించుకోవాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 'రైతువేదిక'లను నిర్మించింది. ఒక్కో వేదికకు సుమారు రూ.22 లక్షల చొప్పున వెచ్చించి జిల్లాలో మొత్తం 106 రైతువేదికలను నిర్మించారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్న రైతువేదికలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అధికారులతోపాటు సీఎం, మంత్రులతో రైతులు మాట్లాడేలా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి రైతువేదికలో వీడియోకాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి రాగా, పలుచోట్ల ఇన్‌స్టాలేషన్ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతానికి నియోజకవర్గం పరిధిలోని ఒక రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు ఏర్పాటు చేస్తుండగా, రానున్న రోజుల్లో మండలానికో రైతువేదికలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు, కంప్యూటర్, ఇతర సామగ్రి కలిపి ఒక్కో యూనిట్‌కు రూ.4లక్షల వరకు ఖర్చు చేయనుంది.


నిధులు లేక నిరుపయోగం

నిర్వహణకు నిధులు లేకపోవడంతో రైతు వేదికలను చాలాచోట్ల మూసి ఉంచుతున్నారు. 2022 డిసెంబర్‌లో రూ.47.77లక్షలు విడుదల చేసిన ప్రభుత్వం.. ఇంత వరకు పైసా ఇవ్వలేదు. విద్యుత్ బిల్లులు, తాగునీరు, వాచ్ అండ్ వార్డ్, స్టేషనరీ, సమావేశాలు, ఇతర ఖర్చులు కలిపి నెలకు రూ.9వేల చొప్పున గతంలో నిధులు వచ్చాయి. ఏడాదికిపైగా నిర్వహణ నిధులు రాకపోవడంతో రైతువేదికలు అధ్వానంగా మారుతున్నాయి. వీడియో కాన్ఫరెన్స్ సేవల నిర్వహణకు నిధులు కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

వీడియో కాన్ఫరెన్స్ అందుబాటులోకి రానున్న రైతు వేదికలు

నియోజకవర్గం	రైతువేదిక
బాల్కొండ	ముప్కాల్
ఆర్మూర్	ఆర్మూర్
బోధన్	ఎడపల్లి
ని.రూరల్	మెంట్రాజ్‌పల్లి

నెలాఖరుకల్లా అందుబాటులోకి..



నియోజకవర్గం పరిధిలో ఒక రైతువేదికలో వీడియోకాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎడపల్లిలో ఇన్‌స్టాలేషన్ పూర్తయ్యింది. మిగతా చోట్ల నెలాఖరునాటికి పూర్తి చేయిస్తాం. మండలానికి ఒక చోట కూడా వీసీ సదుపాయం వచ్చే అవకాశం ఉంది. రైతు వేదికల నిర్వహణకు నిధులు కావాలని ఉన్నతాధికారులను కోరాం.
– వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

తిండికి తిప్పలు

- సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకాని భోజన ఏజెన్సీ నిర్వాహకులు
- ఆకలితో అలమటించిన విద్యార్థినులు
- వర్ని మహాత్మాజ్యోతిబా పూలే రెసిడెన్షియల్‌లో ఇష్టారాజ్యం



భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థినులు

వర్ని: మండలంలోని పాతవర్నిలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వకుండా మంగళవారం రాత్రి నుంచి విధులకు హాజరుకాకపోడంతో విద్యార్థినులు తిండికోసం తిప్పలు పడ్డారు. పాఠశాలలో మొతతం 418 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఇతరుల సహాయంతో మంగళవారం రాత్రి విద్యార్థినులకు భోజనం సిద్ధం చేసి మమ అనిపించారు. అప్పటికీ ప్రిన్సిపల్ అప్రమత్తం కాకపోవడంతో బుధవారం ఉదయం కూడా అదే పరిస్థితి నెలకొంది. ఉదయం 9.15కు టిఫిన్ అందించాల్సి ఉండగా, 11.30గంటలకు నీళ్లచారుతో అన్నంపెట్టి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం నుంచి భోజన ఏజెన్సీ నిర్వాహకులు లక్షలాది రూపాయలు తీసుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. ప్రిన్సిపల్‌తోపాటు సంబంధిత అధికారులు పట్టించుకోకపోడంతో తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు



సమయానికి భోజనం పెట్టకపోగా, నాణ్యత ఉండడం లేదు. మాకు అందించే భోజనం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. భోజన ఏజెన్సీని వెంటనే రద్దుచేసి ఇతరులను నియమించాలి. లేదంటే మాకు పస్తులు తప్పవు. – శ్రావణి, పదోతరగతి

నిర్వాహకుడిలో మార్పు లేదు



సమాచారం ఇవ్వకుండా వంట చేసే కార్మికులు డుమ్మాకొట్టారు. ఇదివరకు కూడా రెండుసార్లు ఇలాగే జరిగింది. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందజేసినా.. నిర్వాహకుడిలో మార్పు రావడం లేదు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తెలియడం లేదు. – స్వప్న, ఇన్‌చార్జి ప్రిన్సిపల్

జేసీకి నివేదిక ఇస్తాం

కార్మికులు చెప్పకుండా వెళ్లిపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక ముందు ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటాం. భోజనం ఏజెన్సీ నిర్వాహకుడిపై చర్య నిమిత్తం జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాను.
– సత్యానందరెడ్డి, ఆర్‌సీవో

క్లుప్తంగా

ఇద్దరు లైన్‌మన్‌ల సస్పెన్షన్

నందిపేట్(ఆర్మూర్): మండలంలో విద్యుత్ శాఖ విధుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరు లైన్‌మన్‌లు సస్పెన్షన్‌కు గురయ్యారు. సిహెచ్ కొండూర్ లైన్‌మన్ నవీన్, కుద్వాన్‌పూర్ చెందిన వేణుగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసుల అదుపులో రైస్‌మిల్ యజమాని!

వర్ని: వర్ని, కోటగిరి మండలాల్లోని రైస్‌మిల్లుల్లో ప్రభుత్వం మిల్లింగ్ కోసం ఇచ్చిన వడ్లను అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్న కేసులో ప్రధాన నిందితుడైన ఒక రైస్‌మిల్ యజమానిని వర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వర్నికి చెందిన సదరు రైస్‌మిల్ యజమానిని కామారెడ్డి జిల్లా పిట్లం వద్ద పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. సుమారు రూ.30కోట్ల విలువ గల బియ్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి ఇవ్వకుండా అమ్ముకొని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు రైస్‌మిల్ యజమానిని పోలీసులు విచారిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

'ఓపెన్' అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి అడ్మిషన్ల గడువు పెంచినట్లు కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లను ఈనెల 29వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే మార్చి 31వరకు రూ.200 అపరాధ రుసుంతో అడ్మిషన్లు పొందవచ్చునున్నారు. డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్ష తేదీలను వాయిదా వేశామన్నారు. 5వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26నుంచి, మూడో సెమిస్టర్ పరీక్షలు మార్చి 5నుంచి నిర్వహించబడతాయని తెలిపారు. పరిక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ఫోటో గుర్తింపును తీసుకురావాల్సి ఉంటుందన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నారాయణ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ కుంట లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన మర్రి హర్ష 99.62శాతంతో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని బుధవారం జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజు అభినందించారు. అలాగే విద్యార్థులు లిఖిత్ 94.23శాతం, శివరాత్రి కీర్తన 91.63శాతం, సుశ్రీగా 90.78 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు మరిన్ని మంచి ఫలితాలు సాధించి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట గల ఉన్న చికెన్ సెంటర్ వద్ద బుధవారం గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి ఎస్సై నీరేష్ వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడు కడపకు చెందిన వాడని అతను కాస్మెటిక్స్ అమ్ముకోవడానికి ఇటువైపు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'అనుమతి' లేని చదువులు

- జిల్లాలో నిబంధనలు పాటించకుండా ఏర్పాటైన పలు ప్రయివేటు బడులు
- విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించని వైనం



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ప్రయివేట్ పాఠశాలల ఆగడాలు పెరిగిపోతున్నాయి. అనుమతి లేకుండానే ప్రతి ఏటా అనేక పాఠశాలలు కొత్తగా పుట్టుకొస్తున్నాయి. మరికొన్ని కనీస నిబంధనలు పాటించకుండానే పాఠశాలలను నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ యాజమాన్యాలు స్టైలే వేరు. పాత పాఠశాలల గుర్తింపును వాడుకొని కార్పొరేట్ పేరును వినియోగించుకుంటున్నారు. ఇలా తల్లిదండ్రులను, విద్యార్థులను బురిడీ కొట్టిస్తూ ప్రతి ఏటా ప్రయివేట్ పాఠశాలలు భారీగా ఫీజుల వసూలు చేసేలా నెలకొల్పుతున్నారు. వాటి ఆగడాలను అరికట్టాల్సిన జిల్లా విద్యాశాఖ ఉదాసీన వైఖరి ప్రదర్శించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రయివేటు పాఠశాలల ఏర్పాటుకు సంబంధించి అన్ని సౌకర్యాలు ఉండి, నిబంధన ప్రకారం ప్రతి ఏటా డిసెంబర్‌లోపు చలానాలు చెల్లించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్‌లోనే కొత్త పాఠశాలలు నెలకొల్పుతున్నారు. దీనికి ఎలాంటి అనుమతి తీసుకోవడం లేదు. జిల్లాలో బోధన్ రోడ్డులోని రెండు పాఠశాలలు, వినాయక నగర్‌లోని మరో పాఠశాలలు, ఆర్మూర్ రోడ్‌లోని రెండు పాఠశాలలు ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్నాయి. హైమద్‌పుర కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాల ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నారు. వీటన్నింటికి ఎలాంటి అనుమతి లేవు. కనీసం విద్యార్థులకు తగిన సౌకర్యాలు కూడా ఆయా బడుల్లో లేవు. అయినా ఫీజులు మాత్రం రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. కంఠేశ్వర్‌లోని కార్పొరేట్ పాఠశాల నగరం పాత పాఠశాల పేరు మీద పాఠశాలను కొనసాగిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తోంది. టీసీలు, బోనాఫైడు మాత్రం పాత పాఠశాల పేరు మీదనే కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈ పాఠశాలను నెలకొల్పి రెండేళ్లు గడుస్తున్న అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఆర్మూర్‌లోని మరో కార్పొరేట్ పాఠశాల కూడా పాత పాఠశాల పేరు మీద గుర్తింపును వాడుకొని కొనసాగుతుంది. జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులోని ఓ పాఠశాల వాణిజ్య సముదాయంలో కొనసాగుతుంది బోధన్‌లోని మరో రెండు పాఠశాలలు వాణిజ్య సముదాయంలో కొనసాగుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లోని ఓ పాఠశాల గుర్తింపు పొందేందుకు తప్పుడు మార్గాలను అనుసరించింది. నకిలీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించి అడ్డదారిలో అనుమతులు సంపాదించింది. దీనికి విద్యాశాఖ కూడా వత్తాసు పలకడం గమనార్హం. విద్యార్థులను తల్లిదండ్రులను బోల్తా కొట్టించి అడ్మిషన్ల కోసం పాట్లుపడుతుంది. అలాగే బోధన్ రోడ్‌లోని ఓ పాఠశాల కేవలం ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతి తీసుకొని, గత ఐదు సంవత్సరాలుగా పదో తరగతి వరకు తరగతులను బోధిస్తుంది. పైతరగతులకు మరో పాఠశాల గుర్తింపును వాడుకుంటున్నారు ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. అయినా ఆయా పాఠశాలలపై అధికారులెవరైె చర్యలు తీసుకోవడం లేదు.

ఫీజుల పేరిట భారీగా వసూళ్లు...

ప్రయివేట్ విద్యా సంస్థలు కార్పొరేట్ విద్యాసంస్థల పేరు మీద పాఠశాలలను ఏర్పాటు చేసుకొని, భవనాలను అద్దెకు తీసుకొని చిన్నచిన్న గదులు, వాణిజ్యసముదాయాల్లో కొనసాగిస్తున్నారు. కార్పొరేట్ పేరు చెప్పి స్థానికంగా పాఠశాలల కంటే రెండు రెట్లు ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. నీట్, ఐఐటి కోచింగ్ పేరిట ప్రత్యేక తరగతుల బోధన అంటూ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. గంగస్థాన్‌లోని కార్పొరేట్ పాఠశాల ప్రత్యేక తరగతుల బోధన పేరిట అదనపు రుసుములు వసూలు చేస్తోంది. ఒకటో తరగతి నుంచి ఫీజుల వసూలు భారీగా కొనసాగిస్తున్నారు. పాఠశాలలకు ఆటస్థలం లేకపోయినా విశాలమైన బోధన గదులు లేకపోయినా ఫీజులు మాత్రం భారీగా వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అధిక ఫీజులను నియంత్రించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి లేకుంటే చర్యలు..

జిల్లాలోని ప్రయివేటు పాఠశాలలు తప్పనిసరిగా అనుమతి తీసుకొని, తరగతులు నిర్వహించాలి. లేదంటే చర్యలు తీసుకుంటాం. బడుల్లో నిబంధనల ప్రకారం అన్ని ఉంటేనే అనుమతి జారీ చేస్తాం. ప్రయివేటు పాఠశాలలు అనుమతి లేకుండా కొనసాగుతుంటే మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

–దుర్గాప్రసాద్, డీఈవో

అదనపు కలెక్టర్ అంకిత్ బాధ్యతల స్వీకరణ





బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్.. కలెక్టర్‌ను కలిసిన డీపీవో తరుణ్‌కుమార్

సుభాష్‌నగర్: జిల్లా అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థలు) అంకిత్ బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా కొనసాగిన చిత్రామిశ్రాను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో అక్కడ పనిచేస్తున్న అంకిత్‌ను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ప్రభుత్వం పోస్టింగ్ కల్పించింది.

డీపీవోగా చక్రవర్తి తరుణ్‌కుమార్..

జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా చక్రవర్తి తరుణ్‌కుమార్ బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీపీవోను కార్యాలయ ఏవో సిద్ధిరాములు, సిబ్బంది సంగ్రామ్, కృష్ణ, రాజబాబు, ఆదిత్య సన్మానించారు.

సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలో మొదటి స్థానం

- కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ

కామారెడ్డి క్రైం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేయడంలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని ఎస్పీ సింధుశర్మ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సీఈఐఆర్ అప్లికేషన్ వచ్చిన తర్వాత ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,053 మొబైల్ ఫోన్ లను రికవరీ చేశామన్నారు. బాన్సువాడ సబ్ డివిజన్ పరిధిలో 442, కామారెడ్డి పరిధిలో 398, ఎల్లారెడ్డి పరిధిలో 213 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని తెలిపారు. మొబైల్ ఫోన్‌ల రికవరీలో బాన్సువడ పీఎస్ మెదటి, కామారెడ్డి పీఎస్ ద్వితీయ స్థానాల్లో ఉన్నయని వెల్లడించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీసులను సంప్రదించి సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌ల రికవరీలో విశేషంగా కృషి చేస్తున్న సిబ్బందిని అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి శివారులోని జాతీయ రహదారి 44పై ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన బండారు శ్రీను(52) కొన్నేళ్ల క్రితం జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు వచ్చి స్థిరపడ్డాడు. గ్రామంలోనే ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం నిర్మల్‌లో ఉంటున్న తన కూతురు వద్దకు భార్యతో కలిసి బైక్‌పై బయల్దేరి వెళ్లాడు. ఆర్మూర్‌లో భార్యను బస్సులో ఎక్కించి ఆయన బైక్‌పై వెళ్లాడు. ఈక్రమంలో వేంపల్లి శివారులో జాతీయ రహదారి 44పై అతడి బైక్ రేలింగ్‌కు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ట్లు ముప్కాల్ ఎస్సై భాస్కరచారి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ..



పోశవ్వ (ఫైల్)

దోమకొండ: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన ఉపాధి హామీ మహిళా కూలీ బుధవారం ఉపాధి పనులు చేస్తూ గుండెపోటుకు గురై మృతిచెందింది. గ్రామానికి చెందిన పాగోంటి పోశవ్వ(54) ఎల్లమ్మ చెరువు కాలువ పనులు చేయడానికి వెళ్లింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని తోటి మహిళా కూలీలకు తెలిపింది. వెంటనే వారు దోమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతురాలికి భర్త స్వామి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. గ్రామస్తులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చారు. ఉపాధి హామీ పనుల వద్ద ఎలాంటి వైద్య సదుపాయాలు లేవని గ్రామస్తులు ఆరోపించారు.

కలెక్టరేట్ ఉద్యోగినంటూ మోసాలు

- ఒకరిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఉద్యోగినంటూ మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిపై పట్టణ పోలీసులు బుదవారం కేసు నమోదు చేశా రు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పెద్దబజార్ ప్రాంతానికి చెందిన మంగలి రాములు కు ఈనెల 6న ఓ వ్యక్తి పరిచయం అయ్యా డు. తన పేరు విజయ్ కుమార్ అని, ఎస్సీ కార్పొరేషన్‌లో ఉద్యోగం చేస్తున్నానని నమ్మించాడు. చాలామందికి దళితబంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, బీసీ బంధు ఇప్పించానని చెప్పాడు. ఇల్లు, బీసీ బంధు ఇప్పిస్తానని నమ్మించి రాములు వద్ద నుంచి విడతలవారీగా రూ.39 వేలు వసూలు చేశాడు. తర్వాత ఎన్నిసార్లు అడిగినా స్పందించకపో వడంతో రాములు పట్టణ పోలీసులను ఆశ్ర యించాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు ఉద్యోగి కాదని, అమాయకులకు మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. రాములు ఫిర్యాదు మేరకు గుర్రపు విజయ్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

- అవయవ దానానికి ముందుకు వచ్చిన కుటుంబం



కార్తీక్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ కానిస్టేబుల్, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అతడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. వివరాలు ఇలా.. పట్టణంలోని గడీ రోడ్డులో నివాసం ఉండే బెజ్జంకి కార్తీక్ (33) డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతడు బైక్‌పై వెళుతుండగా దేవునిపల్లి వద్ద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాదులోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతనికి భార్య సంజన, కుమార్తె వామిక, తల్లిదండ్రులు ఉన్నారు. పుట్టెడు దు:ఖంలోనూ కార్తీక్ కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో అవయవ దానానికి ముందుకు వచ్చారు. వారి అనుమతితో ఆస్పత్రి సిబ్బంది అతని అవయవాలను సేకరించారు. అవయవ దానంతో తాను చనిపోతూనే మరో నలుగురికి జీవితాల్లో వెలుగులు నింపాడు కార్తీక్. కార్తీక్ అంత్యక్రియలు కామారెడ్డిలో బుధవారం సాయంత్రం జరిగాయి.

బాన్సువాడ మండలంలో ఒకరు..



సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన సంగెం సత్యనారాయణరెడ్డి (48) ఈనెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళ వారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం పొలానికి నీళ్లు పెట్టి ఇంటికి తిరిగి వస్తుండగా దత్తాత్రేయ మందిరం సమీపంలోని అతడి బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణరెడ్డి తీవ్రంగా గాయపడడా, చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

బాన్సువాడలో మరొకరు..

బాన్సువాడ రూరల్: పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో నివాసముండే తాపీమేస్త్రీ తగిలేపల్లి పోశెట్టి(50) మంగళవారం యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొన్ని నెలల క్రితం పోశెట్టి ఓ ప్రమాదానికి గురై, గాయపడ్డాడు. అప్పటినుంచి అతడు మంచానికే పరిమితం కావడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో ఇటీవల ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ కృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎట్టకేలకు అందిన నియామక పత్రాలు

- 2022 ఏప్రిల్‌లో కానిస్టేబుళ్ల నియామకానికి నోటిఫికేషన్
- 22 నెలల తర్వాత మోక్షం
- హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా ఆర్డర్ కాపీలు

ఖలీల్‌వాడి: పోలీస్‌శాఖలో వివిధ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో సీఎం నియామక పత్రాలను అందించారు. ఈమేరకు జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లలో ఎంపికై న అభ్యర్థులను ఉదయమే ఉన్నతాధికారులు ప్రత్యేక బస్సులలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియానికి తరలించారు. జిల్లాలోని సుమారు 540 మంది వరకు పోలీస్ నియామక మండలి(టీఎస్ఎల్పీఆర్బీ) పోలీస్‌శాఖలో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్), టీఎస్ఎస్పీ, ఎస్పీఎఫ్, అగ్నిమాపకశాఖలోని ఫైర్‌మెన్, జైళ్లశాఖలో ఉద్యోగాలు పొందారు.

ప్రభుత్వం మారడంతో..

2022 ఏప్రిల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రిమిలినరీ, ఫిజికల్ టెస్ట్‌లు, మెయిన్స్ నిర్వహించిన తర్వాత అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసి పోలీస్‌శాఖలోని వివిధ విభాగాలలోని ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో వెల్లడించారు. తర్వాత కోర్టు కేసులో కొన్ని రోజుల పాటు ఫలితాలపై సందిగ్ధత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కానిస్టేబుల్ ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఐదు రోజుల క్రితం మెడికల్ టెస్ట్‌లు నిర్వహించారు. బుధవారం నియామక పత్రాలు అందించారు.

19నుంచి శిక్షణ?

ఈ నెల 19నుంచి కానిస్టేబుళ్లకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది. ఈ శిక్షణ సివిల్ కానిస్టేబుళ్లకు ఇస్తారా అనే చర్చ సెలక్షన్ అయిన అభ్యర్థులలో చర్చ జరుగుతుంది. ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్), టీఎస్ఎస్పీ, ఎస్పీఎఫ్, అగ్నిమాపకశాఖలోని ఫైర్‌మెన్, జైళ్లశాఖలోని వార్డెన్‌లకు కూడా వీరితోపాటు ఇస్తారా లేక సమయం పడుతుందనే చర్చ జరుగుతుంది. దీనిపై పోలీస్ నియామక మండలి ఇచ్చే ప్రకటన ఆధారంగానే ఉంటుందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. నియామక పత్రాలు వచ్చినా, శిక్షణ అందరికి ఒకేసారి కొనసాగిస్తే బాగుంటుదని ఎంపికైన అభ్యర్థులు పేర్కొంటున్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించండి



తెయూ హాస్టల్ ఎదుట బైఠాయించిన విద్యార్థినులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు హాస్టల్ ఎదుట బైఠాయించి వర్సిటీ ఉన్నతాధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి వెంటనే హాస్టల్ వద్దకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో సరైన భోజనం వండటం లేదని, టిఫిన్ సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. దీంతో తాము ఉదయం టిఫిన్ చేయకుండా ఆకలితో నిరసన తెలుపుతున్నామన్నారు. భోజనం తయారీలో నాణ్యత పాటించాలని కోరారు. అలాగే హాస్టల్‌లో గదులు సరిపోవడం లేదని నలుగురు ఉండాల్సిన ఒక్కో గదిలో 8మంది వరకు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన హాస్టల్ నిర్మిస్తామని వర్సిటీ ఉన్నతాధికారులు రెండు సంవత్సరాలుగా ఇస్తున్న హామీలు నీటి మూటలుగా మిగిలాయని విమర్శించారు. మెస్ బిల్లుల్లో అవకతవకలు జరిగాయని, బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన రిజిస్ట్రార్ యాదగిరి హాస్టల్ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం రుచికరంగా నాణ్యతతో చేయాలని ఆదేశించారు. వంట సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కొత్తవారిని నియమిస్తామని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించారు.

16న ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారులకు స్వాగత ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా, షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహాదారుగా నియమితులై, మొదటిసారి జిల్లాకేంద్రానికి వస్తున్న సందర్భంగా ఈ నెల16న భారీ ఎత్తున స్వాగత ర్యాలీ నిర్వహించనున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాహెర్‌బిన్‌హందాన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడుతున్న మహేష్‌కుమార్ గౌడ్, షబ్బీర్‌అలీకి పార్టీ అధిష్టానం ముఖ్యమైన పదవులు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ముందుగా బైక్ ర్యాలీ అనంతరం అభినందన సభ ఉంటుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున రావాలని కోరారు. గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ చేసిన అవినీతి, అప్పులకు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా శ్వేతపత్రం విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా పనిచేస్తుందన్నారు. నాయకులు రత్నాకర్, జావిద్ అక్రమ్, శేఖర్‌గౌడ్, దయాకర్‌గౌడ్, రాంభూపాల్, అంతిరెడ్డి విజయపాల్ రెడ్డి, గంగారెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

సొసైటీ బహిష్కరణపై ఫిర్యాదు



సీపీ కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు

ఖలీల్‌వాడి: కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి గీతా పారిశ్రామిక సహకార సంఘం(సొసైటీ)లో ఉన్న ఇతర కులాలకు చెందిన గీతాకార్మికులను గౌడ కులస్తులు బహిష్కరించినట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు బుధవారం సుమారు 40 మంది బాధితులు సీపీ కార్యాలయానికి తరలివచ్చి, ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సహకార సంఘంలో 111 మంది సభ్యులు ఉంటే, మెజార్టీలో ఉన్న గౌడ గీతా కార్మికులు ఇతర కులాలకు చెందిన గీతాకార్మికులు ఉండవద్దని చెబుతున్నారన్నారు. తాము గీత వృత్తికి వెళ్లితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన గీతాకార్మికులను ఈత వనాల వద్దకు రానివ్వడం లేదని, కొంత మంది దూషించినట్లు పేర్కొన్నారు. దీనిపై కమ్మర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఎక్సైజ్ అధికారులు, కోఆపరేటివ్ అధికారుల చుట్టూ ఆరు నెలల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలన్నారు.

విద్యార్థిని మృతి కేసులో కొనసాగుతున్న విచారణ

రామారెడ్డి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థిని భారతి (15) ఆకస్మిక మరణం మిస్టరీగా మారింది. ఈనెల 8న తల్లిదండ్రులు కూలీ పనికి వెళ్లి, తిరిగి వచ్చేసరికి భారతి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న స్థితిలో ఉంది. స్కూల్‌కు వెళ్లమని మందలించినందుకు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుందని తండ్రి సాంబ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని భారతిది ఆత్మహత్య కాదనీ, ఖచ్చితంగా హత్యేనని అనుమానం వ్యక్తం చేశారు. ఆమెను తండ్రి, కుటుంబ సభ్యులు కలిసే హత్య చేశారని ఆరోపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి ఎందుకు తీసుకురాలేదని, గుర్తుతెలియని ప్రాంతంలో ఎవరి కీ చెప్పకుండా అంత్యక్రియలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని కోణాల్లో విచారణ జరపాలని ఎస్సై కొండా విజయ్‌కి ఫిర్యాదు చేశారు. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, బాగా చదువు కుని ఉన్నత స్థానంలో ఉంటానని చెప్తూ ఉండేదని తోటి విద్యార్థులు చెబుతున్నారు. దీంతో భారతి మృతిపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కేసులో ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు మేరకు విచారణ కొనసాగిస్తున్నామని ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే మృతికి గల కారణాలు స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. అసలు ఏం జరిగి ఉంటుందనే సందేహాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. కేసు ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

'ఆన్‌లైన్ ఉద్యోగాల మోసం'పై కేసు నమోదు!

ఖలీల్‌వాడి: ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేసిన ఇద్దరితోపాటు మరికొంత మందిపై పోలీసులు కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీ వద్ద ఉన్న ఓ గొలుసుకట్టు ఆన్‌లైన్ సంస్థలో రూ. 45వేలు చెల్లిస్తే ప్రతి నెల ఆన్‌లైన్ ద్వారా ఆదాయం వస్తుందని యువతకు నిర్వాహకులు నమ్మబలికారు. దీంతో తెలంగాణతోపాటు ఆంధ్రప్రాంతంకు చెందిన వారిని నిజామాబాద్‌లో ఆఫీస్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో వివిధ వస్తువులకు సంబంధించిన ఐదు ప్రొడక్ట్‌లను ఎంట్రీ చేయాలని సూచించినట్లు తెలిసింది. దీంతో ప్రతి నెల రూ. 20వేల నుంచి రూ. 30వేల వరకు ఆదాయం వస్తుందని నమ్మబలికారు. డిగ్రీ చేసిన పలువురు ఈ ఆన్‌లైన్ ఉద్యోగంలో చేరారు. ఉద్యోగంలో చేరిన వారు ఎవరినైనా ఆన్‌లైన్ ఉద్యోగంలో చేర్పిస్తే వారికి అదనంగా రూ.11వేలు చెల్లిస్తామని నమ్మబలికారు. ఇటీవల మంచిర్యాలకు చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో చేరారు. ప్రతి నెల రావాల్సిన వేతనం రాకపోవడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. దీనిపై సౌత్ సీఐ సురేష్, నిజామాబాద్ ఎస్సై మహేష్ విచారణ ప్రారంభించారు. ఇందులో ఇద్దరిపై కేసులు నమోదు చేశామని ఎస్సై మహేష్ తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతుందన్నారు.